# తీయని చేదు పుట

సి.ఎస్.రావు



జీవిత కావ్యంలో ఎన్నో పుటలు!

కొన్ని తీయని పుటలు!

కొన్ని చేదు పుటలు!

పాతికేళ్ళ క్రితంనాటి మాట. కాలేజీలో బి ఏ చదువుతున్నాను. ఏడాదిపాటు తలవంచుకునే కాలేజీకి వెళ్ళేను. రెండవ సంవత్సరంలో అనుకోకుండా రవళితో మాట్లాడేను. కాదు. రవళే నాతో మాట్లాడింది. ఆరోజు నుంచీ ఆమెను ఆకర్షించాలన్న తాపత్రయం. ముస్తాబుమీద ఆసక్తి. నా ఉనికిని ఆమె గుర్తించాలన్న తపన– వయస్సలాంటిది.

రవళి కాలేజీకి ఎప్పుడూ లేటుగా వచ్చేదికాదు. నేనెప్పుడూ లేటుగానే వెళ్ళేవాడిని. మాటలు కలిసి పరిచయం పెరిగాక ఆమెకంటే ముందే వెళ్ళేవాడిని. ఆమెకోసం ఎదురు చూసేవాడిని. ఎదురుచూసి ఎదురుచూసి ఆమె కనిపించగానే 'ఎదురుచూడడంలో ఎంత హాయి!' అనుకునేవాడిని.

ఎక్కడో లాస్టు బెంచీలో కూర్చునే వాడిని అంతక్రితం. మా పరిచయం పెరుగుతున్నకొద్దీ వెనకనుంచి ఒక్కొక్క బెంచే దాటుతూ సరిగ్గా ఆమె వెనకబెంచీలోకి వచ్చేశాను. ఆమెకు ఎంత చేరువగా వుంటే అంత వుల్లాసంగా వుండేది మనసు. పదిమంది అమ్మాయిల మధ్య రవళి క్లాసులో కూర్చుంటే సాదా బల్బుల మధ్య నియాన్ దీపంలా వెలిగిపోయేది ఆమె నవ్వితే జలపాతాలు గుర్తుకువచ్చేవి. నిజంగా ఆమె నవ్వు జలపాతమే. సూర్యుడు తూర్పున ఉదయించకపోవచ్చును కానీ ఆమె పెదవులమీద నవ్వు లేకుండా వుండదు.

'అలా నవ్వగలగడం ఒక వరం. అలాంటి వరప్రసాదిని నాకు పరిచయం కావడం అదృష్టం. ఆమె నాదే అయితే ఎంతబావుండేది!' అనుకునేవాడిని.

ఒక రోజున, ఆ రోజూ వచ్చిందని మురిసిపోయాను.

"మీరు కనిపించకపోతే నాకు తోచదు," అంది రవళి.

"నాకూ అంతే," అన్నాను.

"మనకి రెండో సంవత్సరంలో పరిచయం అయింది కానీ మొదటి సంవత్సరంలోనే యింత పరిచయం వుంటే!"

"మన పరిచయం యీ పాటికి పువ్వులు పూసేది."

"ఇంకా నయం, పళ్ళు కాసేది అన్నారు కాదు," అని నవ్వింది రవళి.

ఆ నవ్వుకు పున్నమి సముద్రంలా

పొంగింది నా మనసు. అలాగే ఆమె ముఖంలోకి చూస్తూ వుండిపోయాను

"ఏమిటా చూపులు?" అంది.

"ఇష్టమైన పిండివంటని తిని తృప్తి పడతాం. నచ్చిన వస్తువును కొనుక్కొని సంతోషిస్తాం. చేతికి దొరకనిది, కొన దానికి అందనిది అందం_ ఆ అందాన్ని చూసే ఆనందించాలికదా," అన్నాను.

"అందం అందుబాటులో వున్నా, చూస్తూనే వుండిపోతారా?" అంది కొంటెగా ఆమె.


"రవళీ!" అంటూ ఆమె మృదువైన అరచేతిని నా అరచేతుల్లోకి తీసుకున్నాను

ఆమె చేయి ఎంత మృదువుగా వుందో, అంత మృదువుగానూ తనచేతిని వెనక్కి తీసుకొని_

"మనసులు కలవడానికి ముహూర్తాలు అక్కరలేదుకానీ తనువులు కలవడానికి పెద్దల అనుమతీ, ముహూర్తం కావాలి," అని ఆమె ముందుకు నడిచింది. వెనకనే పసివాడిలా నడిచాను. ఆ క్షణంలో ఆమె నాకు పాఠాలు చెబుతూన్నట్టు అనిపించింది. ఆమె నడిపించేదీ, నేను నడిచేవాడినీ. అది ఒక మరుపురాని మైమరపించే క్షణం....

* * *

సంక్రాంతి శలవల తర్వాత కాలేజీ తెరిచారు. అరగంట ముందే వచ్చాను కాలేజీకి. రవళి రాకకోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తున్నాను. పదిగంటలయింది. క్లాసులోకి లెక్చరరుకూడా వచ్చేశారు. నేనింకా రవళికోసం బయటే నిలబడ్డాను. రవళి జాడలేదు రవళి లేని క్లాసుకి పోబుద్ధికాలేదు! క్లాసురూంవైపు చూస్తే యేదో వెలవెలపోతోంది. రవళి వుంటే బృందావనంలా అనిపించే క్లాసు రంగుమాసిన తాజ్‌మహల్‌లా అనిపించింది. రూంకి వెళ్ళిపోవడమా, యింకా వెయిట్ చేయడమా?—తేలని సందిగ్ధం.




ఆమె తప్పకుండా వస్తుందన్న ఆశ. ఆ ఆశ కాలేజీనుంచి నన్ను వదలి రానివ్వడంలేదు.

ఫస్టుపీరియడు అయిపోయింది. గేటు వైపే చూస్తున్న నా కళ్ళు రవళి రిక్షా దిగడం చూశాయి. కాళ్ళు అనుకోకుండా రిక్షావైపు నడిచాయి.

"చిల్లర కావాలా?" అన్నాను.

నా మాట వినిపించుకోకుండా రిక్షా వాడికి డబ్బులిచ్చేసింది. క్లాసురూంవైపు నడిచింది. వంచిన తల యెత్తలేదు. మాటకు బదులు చెప్పలేదు. ఎప్పటిలా నవ్వలేదు.

ఆమె ప్రవర్తన నా కర్థంకాలేదు.

నా మనసు నొచ్చుకుంది.

"ముక్కూ, మొహం తెలియని పరాయిమనిషి పలకరించినట్టు ప్రవర్తించిందేమిటి?" అనుకున్నాను.

అక్కడినుంచి ఇహ రోజూ అంతే. రోజులు గడ్డుగా జరుగుతున్నాయి. ఆమె వెనకనే కూర్చునే నేను ఆఖరి బెంచీకి వెళ్ళిపోయాను. ఆమెకూ నాకూ మధ్య యేదో పెద్ద అగాధం యేర్పడినట్టు అనిపించేది.

మనస్సునిండా ఏదో కోపం.

వెన్నెలంటే వెగటు.

మల్లెలను చూస్తే మంట.

ఏ పనన్నా చిరాకు.

చికాకుగా కాలం గడుస్తోంది.

మా సారస్వత సంఘం కార్యదర్శి మూర్తి ఆరోజున నా పక్కన చేరాడు. క్లాసు జరుగుతోంది. లెక్చరరుకి కనపడకుండా బెంచీమీద ముందుకు వాలి పడుకున్నాను. మూర్తి నన్ను మెల్లిగా తట్టాడు.

"సాయంత్రం కథాకథనం యేర్పాటు చేశాం. నువ్వొచ్చి కథ చెప్పాలి," అన్నాడు చెవిలో.


అతనలా అడగడానికి కారణం లేకపోలేదు అప్పటికే నా కథలు నాలుగైదు పత్రికల్లో వచ్చాయి నేను కథలు రాస్తానని కాలేజీలో తెలుసు.

"నావల్ల కాదు," అన్నాను.

"పిచ్చివేషాలు వెయ్యకు చెప్పాల్సిందే," అని చెప్పి నా పక్కనించి వెళ్ళిపోయాడు మూర్తి.

క్లాసు జరుగుతూనే వుంది. నాకు తెలుసు మూర్తి నన్ను వదలడు. ఎక్కడున్నా వెతికి పట్టుకొస్తాడు. ఏదో ఒక కథ చెప్పక తప్పదు. ఏ కథ చెప్పాలన్నదే సమస్య.

కార్యక్రమం ప్రారంభమయింది. ముందువరసలో అమ్మాయిలందరూ కూర్చున్నారు. నేను అక్కడా వెనక బెంచీలోనే కూర్చున్నాను. కథాకథనం గురించి మా సారస్వత సంఘం సలహా




దారుడు తెలుగు లెక్చరరుగారు వివరించారు.

కథాకథనం సాగుతోంది.

అమ్మాయి ఒక కథ అబ్బాయి ఒక కథ చెప్పారు. నేనంత పట్టింపుగా వినలేదు. అమ్మాయిల వరసలో రవళి కోసం నా కళ్లు వెతుకుతున్నాయి.

నా పేరు పిలిచారు.

నా మనసు తెల్లకాగితంలా వుంది.

వేదికమీదకి వెళ్ళాను. సభను కలియ చూశాను. పైన తిరుగుతున్న పంకాను చూశాను. ఎదురుగా, అమ్మాయిల వరసలో నన్నే చూస్తున్న రవళి కని పించింది. ఆమె కళ్ళల్లోకి చూశాను. ఆమె రెప్పలు దించుకుంది చేతిగడియా రాన్ని సవరించుకుంది. మనసులో యేదో మెరిసింది. కథ ప్రారంభించాను.

"నేనొక గొర్రెల కాపరిని. ఊరు చివర కొండవాలులో గొర్రెల్ని మేప డానికి తోలుకొని వెడుతూ వుంటాను. రోజూ వెడుతున్నాను రంగురంగుల గడ్డిపూల మధ్యనుంచి గొర్రెలు ఛెంగు ఛెంగున పరిగెడుతూ వుంటాయి. వాటి డెక్కల కిదలికలకు ఆకుపచ్చని గడ్డి పరకలు రెపరెపలాడుతూ వుంటాయి. వాటి డెక్కలకింద పడి ఆ గడ్డిపూలు నలిగిపోతే నా మనసు యేడుస్తుంది. అవి లేత పచ్చిక పరకలను మేస్తూవుంటే నా మనసు నలిగిపోతుంది. నడవలేని గొర్రెపిల్లను చంకనెత్తుకుంటాను. మనసును యింత మెత్తగా ఎందుకు చేశాడో దేవుడు అనుకుంటాను. గొర్రెకూ యింత మెత్తని మనసుంటే అది అడుగుతీసి అడుగు వెయ్యగలదా? పచ్చిక మేసి పొట్ట నింపుకోగలదా? అనుకుంటాను మళ్ళీ.

"అలాగే ఏవేవో అనుకుంటూ ఆ గొర్రెల వెనకే నడుస్తున్నాను ఆ రోజు. గొర్రెలు కొండవాలునుంచి మేస్తూ పైకి నడుస్తున్నాయి వాటి వెనక నేను!

"అనుకోకుండా తలయెత్తి పైకి చూశాను. సూర్యుడు కొండకి అవలి పక్కకు దిగిపోతున్నాడు. నాకు అల్లంత దూరంలో ఎవరో దేవత నిలబడినట్టు అనిపించింది.

"ఉలిక్కిపడ్డాను.

"ఆమెను చూసేకొద్దీ చూడాలని పించింది.

"ఏదో వింతకాంతి ఆమెచుట్టూ.

"చిరుగాలికి కదలాడే ఆమె ముంగురులు.

"ఆమె వొంటిని అంటీ అంటక దోబూచులాడుతున్న వలువలు.

"కళ్ళముందు నిలిచిన మెరుపుతీగలా వుందామె.

"దగ్గరకు వెళ్ళాలనిపించింది. నాకు భయంవేసింది.

"ఆమె నావైపు చూసింది.

"చటుక్కున పొదచాటుకు తప్పు కున్నాను నేను. దేవతలు వరాలూ, శాపాలూ కూడా యిస్తారట. ఈవిడ వర మిచ్చే దేవతో? శపించే దేవతో? అను కొని పొదచాటునుంచే దొంగచాటుగా ఆమెను వొదిగి చూస్తున్నాను.

"ఆమె నవ్వింది.

"అది నింగినుంచి నేలకు పరిగెడు తున్న జలపాతం!

"ఆ పరుగుల రవళికి ప్రకృతి పుల కించింది.

"నా మనస్సు ఒక వేణువయింది.

"పొదచాటునవున్న నన్నే ఆమె చూస్తోంది. ఆ చూపులు వర్షించిన వెన్నెల్లో నేను తడిసిపోయాను. నా భయం కొంచెం తగ్గింది. అయినా పొద చాటునుంచి బయటకు రాలేదు.

"ఆమె రెండడుగులు ముందుకువేసి, తన కుడిచేతిని ముందుకు చాచింది. కళ్ళతోటే నన్ను చేరువకు రమ్మని ఆహ్వానించింది. అడుగులో అడుగు వేసుకుంటూ, పసివాడిలా ఆమె ముఖం లోకే చూస్తూ ఆమె దగ్గరకు వెళ్ళాను. ఆమెచేతినింకా అల్లాగే వుంచింది. ఆమె చిటికినవేలు పట్టుకున్నాను. ఆమె నాచేతిని తన చేతుల్లోకి తీసుకుంది. మృదువుగా వొత్తి ముద్దు పెట్టుకుంది. నేను ఎవరో నాకే తెలీటంలేదు. ఆమె చేతిని నా భుజంచుట్టూచుట్టి దగ్గరకు తీసుకుంది నన్ను తీసుకుని శిఖరాగ్రానికి నడిచింది. నేను నడవటంలేదు. ఆమె ముఖంలోకే చూస్తూ గాలిలో తేలిపోతున్నాను.

"అలా గడ్డిపూల సంగతీ, లేతపచ్చిక రేకులసంగతీ, నా గొర్రెల సంగతీ మర్చి పోయి ఆమె వెంట తేలిపోయాను శిఖరా గ్రాన్ని చేరుకున్నాం. ఆ చెయ్యి వదల బుద్ధి కావటంలేదు. ఆమె ముఖం నుంచి నా చూపులు తిప్పుకోబుద్ధి కావటంలేదు. అది కలో, కలలాంటి నిజమో తెలియని స్థితి.

"ఆమె మృదువైన చెయ్యి నాకు గట్టిగా, శిలలా తాకింది

"ఆమె చేతులు చూశాను.

"నిజంగా శిలాహస్తాలే.

"గుండె ఝల్లుమంది.

"తీయని కల కరిగిపోతున్నట్టనిపించింది.

"ఆమె ముఖంలోకి చూశాను.

"అందమైన నిర్జీవ శిల్పం!

"వొళ్ళంతా చూశాను.

అది రాతి బొమ్మ!

"నింగి నుంచి నేలకు వచ్చిన దేవత నన్ను కవ్వించి తన ఆనవాలుగా తన శిలాప్రతిమను నాకు వదలి వేశ్తై నింగికి వెళ్ళిపోయిందేమో—అనుకున్నాను.

"ఏదో వేళకు నాకోసం మళ్ళీ తిరిగొస్తుందని ఆశతో ఎదురుచూస్తూనే వున్నాను.

ఇంకా చూస్తూనే వున్నాను."

కథ ముగించాను.

రవళి కోసం ముందువరసలో చూశాను.

మిగిలిన అమ్మాయిలందరూ వున్నారు—ఆమె తప్ప!

గబగబా వేదిక దిగి బయటకు వెళ్లాను. రవళి అల్లంత దూరాన ఒక స్తంభం చాటున ని బడింది. దగ్గరకు వెళ్లాను. కళ్ళు వత్తుకుంటోంది.

నన్ను చూసింది.

చెమ్మగిల్లిన కళ్ళతో నా దగ్గరకు వచ్చింది.

"మీ రంటే నాకిష్టంలేక కాదండీ. మొన్న శలవల్లో యింటికి వెళ్ళినప్పుడు పెద్దవాళ్ళు పెళ్ళి నిర్ణయించడం, ముహూర్తం పెట్టడం, పెళ్ళిచేసెయ్యడం కూడా అయిపోయింది. ఇలా రాయిని కాక యేంచేయమంటారింక?" అందిరవళి.

నా నోట మాట రాలేదు.

ఆమె కన్నీటిని తుడవడం నాకు చేతకాలేదు. ఆమె ఎప్పటిలా నవ్వుతూనే వుండాలనిమాత్రం కోరుకున్నాను.

ఈనాడు తలచుకుంటే ఆ సంఘటన నా జీవిత కావ్యంలో ఒక తీయని చేదుపుట.

